ఆ దొరికినవాడు ఏం చెపుతున్నాడమ్మా? ఎందుకు చేశారట ఈ హత్యా ప్రయత్నం.

నోరు విప్పటం లేదు సార్ కానీ రెండ్రోజుల్లో అతడ్ని నియమించిన వారెవరో చెప్పిస్తాం, ధీమాగా అంది.

మరీ థర్డు డిగ్రీ ప్రయోగించకండి

ఆమె ఆయనవేపు గౌరవమూ భక్తి మిళితమైన చూపు సారించింది. నిండు సభలో మంత్రి ప్రాణాలు తీయటానికి సిద్ధపడ్డా నరరూప రాక్షసుడి మీద కూడ అత్యాచార పద్ధతులు వద్దు అంటున్న మనిషి.

..... సమావేశం ముగిసే సరికి రాత్రి తొమ్మిదయింది. కార్లు వరుసగా వున్నాయి. తనకారు దగ్గరికి వచ్చి, తలుపు తాళం తీసి లోపల కూర్చుని స్టార్టు చేసింది. రివర్స్‌లో వెనక్కితీసి ముందుకి సాగించింది.

అప్పుడు వినపడింది వెనుకనుంచి నెమ్మదిగా, స్థిరంగా ఓ కంఠం కుమారి కాలి కాపాలి కపిలే కృష్ణపింగళే బాగున్నావా బాలికా?

నడుస్తున్న కారులో అంత చీకట్లో అంత దగ్గర్నుంచి చెవి పక్కగా వినపడిన ఆ స్వరానికి ప్రవల్లిక అదిరిపడి వెనక్కి తిరిగి చూసింది.

వెనుక సీట్లో అనంతానంతస్వామి కూర్చుని వున్నాడు.

ఆమె సడెన్‌గా బ్రేకుకి కారు కీచుమని ఆగింది. అతడు తాపిగా వచ్చి ముందు సీట్లో కూర్చునే వరకూ ఆమె ఈ లోకంలోకి రాలేకపోయింది.

తలుపులు నాలుగూ తాళం వేసి వున్న కారులోకి ఈయన ఎలా వచ్చాడా అనుకుంటున్నవా అమ్మా.

నీ గురించి ఆలోచన్లలో కూడా నేను బహువచనంలో ఆలోచించను కసిగా అంది.

స్వామి నవ్వేడు. అయితే మనం ముఖాముఖమే మట్లాడుకోవచ్చు అని ఆగి అన్నాడు ..... ఇది గవర్నమెంట్ కారు దీని తలుపులు తీయటానికి నేనేమీ దొంగతాళం చేతులు ఉపయోగించలేదు. ఈకారు నీకు అలాట్ చేసినప్పుడు దీని తాలూకు డూప్లికేట్ తాళాలు మీ స్టోర్‌లో పెడతారు. వాటిని మీ అఫిసు వారి ద్వారానే సంపాదించి వచ్చి ఇందులో కూర్చున్నాను. ఇప్పుడు చెప్పు నాకున్న పలుకుబడి సామాన్య మైనదంటావా

ఆమె అప్రతిభురాలై అప్రయత్నంగా కాదు అంది.

ఒప్పుకున్నావ్ కదా నేను చెప్పేది ఏమిటంటే ..... చిన్న పిల్లవి అనవసరంగా ఈ విషయాల్లో జోక్యం చేసుకోకు. నా కుతురిలా కనిపిస్తున్నావు అఫ్‌కోర్స్ నాకు పెళ్ళి కాలేదనుకో కానీ మరీ పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం ఎందుకు అని ..... నువ్వేమిటి ఐపియస్సా ..... ? డైరెక్టు రిక్రూటా?

ఆమె సమాధానం చెప్పలేదు.

ఏదో చెప్పావుట .....

ఆమెకి సింకింగ్ ఫీలింగ్ కలిగింది. సి. బి. ఐ అంటే ఎంతో జాగ్రత్తగా పటిష్టంగా వుండవలసిన డిపార్ట్‌మెంట్ అటువంటి దాన్లోనే అర గంటలోగా రహస్యాలు బయటకు పోతున్నాయంటే మైగాడ్ ..... ఈ దేశాన్ని ఎవరు బాగుచేయగలరు?

ఆమె ఒక నిర్ణయానికి వచ్చినట్లు కారు డ్రైవ్ చేస్తూనే అవును చెప్పాను. అంతే కాదు నిన్న రవీంద్ర కళాక్షేత్ర సంఘటన వెనుక వున్నది కూడ నువ్వే అని నాకు తెలుసు. నీ మనిషి లాకప్‌లో వున్నాడు. ఈరోజు కాకపోయినా రేపయినా అతడు నోరు విప్పుతాడు.

నేను ఇప్పుడు నిన్ను కలుసుకున్నది అందుకేనమ్మ జాతస్యహి ధృవో మృత్యు ఏ దృష్టితో చూసినా మృత్యువు దు:ఖ హేతువు కాకూడదన్నారు. ఈ అనంతానంతస్వామి గురించి నీకు ఏమీ తెలియదు. కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకూ వేళ్ళు పాతుకుపోయిన మర్రి చెట్టు ఇది. దీని నీడలో ఆశ్రయం పొందటం నీకు శ్రేయస్కరం.

లేకపోతే ఏం చేస్తావ్ ప్రాణాలు తీస్తావ్ అంతేగా!

అది సామాన్యులు చేసే పని నేను చేయలేనిదంటూ ఏమీ లేదు. ఉదాహరణకి నువ్వు ఐ.పి.ఎస్ అనుకో నువ్వు ఏ సంవత్సరం పరీక్ష పాసయ్యావో ఆ సంవత్సరం పరీక్ష పేపర్లు తీయిస్తాను. ఆ సంవత్సరం మార్కుల్లో కుంభకోణం జరిగినట్లు నిరూపిస్తాను. ఇన్నాళ్ళు చేసిన ఉద్యోగం పోయి డిగ్రీ పోయి రోడ్డుమీద నిలబడటం కన్నా నరకం ఎమయినా వుంటుందా? అంటూ అతడు నవ్వి ..... తిరిగి అన్నాడు.

చేయని నేరం మోపి ఉద్యోగాన్నించి సస్పెండ్ చేయించడం దగ్గర వారిని బంధించి పెట్టడం ఇవన్నీ చాలా పాత పద్ధతులు ఇన్నాళ్ళు కష్టపడి చదివిన చదువుకీ అసలు డిగ్రీయే పూర్తిగా పోయి కట్టుబట్టల్తో నిలబడవల్సి వస్తే అంతకన్నా నరకం ఇంకొకటి వుంటుందా?

చాలా సేపటి తరువాత ఆమె నవ్వింది అలా నిలబడవలసి వస్తే నీ ఆశ్రమానికే వస్తాను. నువ్వు భజన చేస్తూ ఉంటావు హాలు మధ్యలో నిలబడి నిన్ను కాల్చేసి జైలుకి వెళ్ళిపోతాను. ఈ ముగింపు బావుంది నీకు?

ఫర్వాలేదు నాకు సమ ఉజ్జీవీ దొరికావు. నిన్న ఆగిపోయిన నాటకం ఏమిటి? ఆఖరి పోరాటం కాదూ ..... మంచి టైటిలు

ఒక కారు ఆమె కారుని దాటి ముందుకు సాగింది. ఆ తరువాత రెండు మోటారు సైకిళ్ళు ఆ తరువాత మరో రెండు కార్లు వాటి వెనుక వీళ్ళు ఉన్న కారు.

అతడు సడెన్‌గా సీరియస్ అయ్యాడు. ఈ దేశపు సగం మంది పౌరులు నా భక్తులు సగం మంది రాజకీయ నాయకులకు నేను అరాధ్య దైవాన్ని. సగం మంది వ్యాపారవేత్తల దగ్గిర నా ఫైనాన్స్ వున్నాయి. ఈ రోజు ఇలా జరిగిందని నువ్వు చెప్పినా ఎవరూ నమ్మరు. అసలు నేనిలా ఇంగ్లీషులో అప్పుడప్పుడు మట్లాడతానని నువ్వు అన్నా దే డొన్ట్ బిలీవ్ ఇట్ .....

ఇంకో రెండ్రోజులు ఆరు లాకప్‌లో మన మనిషి నోరు విప్పలే

ఎందుకో తెలీదు కాని అనంతానంతస్వామి బిగ్గరగా నవ్వేడు తమతో పాటు వస్తున్న ఆడీ కారు మరింత పక్కగా రావటంతో ఆమె బలవంతంగా తన కారు పక్కగా తీసి ఆపు చేయవలసి వచ్చింది. ఆ కారులోంచి ఒక వ్యక్తి దిగి ఆమె కారు దగ్గిరగా వచ్చి నమ్రతగా డోర్ తీసి పట్టుకున్నాడు. స్వామి కారు దిగి వెళ్ళొస్తాను అన్నట్టు ఆ లాకప్‌లో వున్న వ్యక్తుల మార్పిడి ఎప్పుడో జరిగిపోయింది. ఒక తాగుబోతుకి బాగా పోయిస్తే పాపం వెళ్ళి జైల్లో కూర్చున్నాడు. నిన్న నువ్వు అరెస్ట్ చేసిన వ్యక్తి ..... a2 ఇడుగో ఇతనే అన్నాడు

ప్రవల్లిక దిగ్భ్రాంతిరాలైంది. తన కళ్ళే తనన్ని మోసం చేస్తున్నాయా అనిపించింది. కారు డోర్ తీసిన వ్యక్తే నిన్న తను అరెస్టు చేసిన వ్యక్తి స్వామితో పాటు వెళ్ళిపోతున్నాడు.

ఆమె రివాల్వర్ తీయబోయింది.

అనవసరం .....

నిన్న తాము అరెస్ట్ చేసింది ఇతడినే అని నిరూపించలేదు. లాకప్ బ్రద్దలు కొడితే కేసు పెట్టి ఇన్వెస్టిగేషన్ చెయ్యవచ్చు కానీ రికార్డులు రికార్డుల్లాగే వుంటే తనేం చెయగలదు? లాకప్‌లో వున్న వ్యక్తి పది రూపాయలకు దేన్నైనా వప్పుకుంటాడు. వదిలివేస్తే A2 బదులు జీవితాంతం జైల్లో వుండమన్నా వుంటాడు. ఇటువంటి ప్రశ్నలున్న దేశంలో చట్టం నాలుగు పాదాలమీద ధర్మాన్ని ఎలా నిలబెడుతుంది? తన డిపార్ట్‌మెంట్ కనీసం నలుగురైదుగురి సాయమన్నా లేకపోయి వుంటే ఇది సాధ్య పడి వుండేదా? ఈ పరిస్థితుల్లో తనేం చెయగలదు?

కారు దగ్గిర నిలబడి A2 స్నేహపురస్కారంగా చెయ్యి వూపాడు. అతడి మొహం మీద కదలాడే ఎగతాళి చిరునవ్వు లైటు వెలుతురులో ఇంత దూరం కనపడుతూంది.

అనంతానంత స్వామి ఎక్కగానే కారు కదిలింది

*            *            *

లేదు నాన్నా నేనీ వృత్తిలో కొనసాగలేను నిస్పృహగా తలాడిస్తూ అన్నది ఆమె అతడు కూతురివైపు సానుభూతితో చూశాడు.

ఎవరు నీతికి నిలబడేవాళ్ళో ఎవరు అవినీతిపరులో తెలియటం లేదు. ప్రాణాలకు తెగించి ఒక టెర్రరిస్టుని పట్టుకుంటే ఇరవై నాలుగు గంటలు తిరిగేలోగా అతడి స్థానంలో మరో అమాయకుడు లాకప్‌లో వుంటాడు. రికార్డు సరిగ్గానే వుంటుంది. సంఖ్య సరిగ్గానే వుంటుంది ప్రత్యర్థుల ఎగతాళి చిరునవ్వే చివరికి మిగులుతుంది

ఆ ఇన్‌స్పెక్టర్ .....

చాలా నిజాయితీపరుడు నాన్నా నేను ముందే వాకబు చేశాను. అతడిని సస్పెండు చేయించటం కూడా వాళ్ళ ఎత్తులో ఒక భాగం అనుకుంటాను.

వాళ్ళు చాలా తెలివైన వాళ్ళలా వున్నారే

తెలివా ..... తెలివా ..... ఆ అనంతానంతస్వామిని చూస్తే అప్పుడే గుడిలో అలంకరించబడిన దివ్య మంగళ విగ్రహంలా వుంటాడు. స్మగ్లింగ్‌కి స్పెల్లింగ్ తెలియనివాడిలా

వుంటాడు. వాడి కోసం నాన్నా నా బాధ. అతడికి సాయం చేస్తున్న మా అధికారుల మీదే నా కోపమంతా దేశం కుళ్ళిపోతోంది.

ఇరవై సంవత్సరాల క్రితం చైనీస్ సరిహద్దుల్లో ప్రాణాలకి తెగించి పోరాడుతున్నప్పుడు కూడా మాకీ విషయం తెలుసమ్మా కానీ దేశాన్ని రక్షించడంలో ఏ నిర్లక్ష్యమూ చేయలేదే మేము..... ఈ స్వార్థపరుల ఇనపపెట్టెలు రక్షించటానికి అక్కడ చలిలో పోరాడు తున్నామనుకోలేదే. ప్రజల కన్నా దేశం ముఖ్యం దేశం కన్నా లక్ష్యం ముఖ్యం.

ఆయన దగ్గరగా వచ్చి చాలా చిన్న వయసులో పెద్ద స్థానాన్ని సంపాదిచంగలిగావు సినిక్‌లా మారకు అని వెళ్ళిపోయాడు.

ఆయన వెళ్ళిపోయాక ఆమె డైరీలో వ్రాసుకుంది.

నేను సినిక్‌గా మారటం లేదు కానీ ఈ బరువులూ బాధ్యతలూ నా మనసు స్వీకరించడం లేదు. ఒక పల్లెటూళ్ళో పైరుగాలిలో పొలాల పక్కన నిశ్చింతగా అల్లరి చేస్తూ బ్రతికెయ్యాలని నా మనసు ఉవ్విళ్ళూరుతోంది. ఈ పదవీ ఈ కృత్రిమత్వమూ ఎత్తులకి పై ఎత్తులూ అన్నీ నా లేలేత ఉత్సాహాన్ని పిల్చి పిప్పి చేస్తున్నాయి. నాన్న అన్నట్లు ఇదంతా అదృష్టమే అయితే అంత అదృష్టం నాకొద్దు. చదువూ తెలివి తేటలు హోదా ఆస్థి ఇవన్నీ వరాలయితే వాటన్నింటికన్నా మించి ఆనందం అది లేకపోయాక ఇవన్నీ ఎందుకు? ఇంత చిన్న వయస్సులోనే ఎవరిమీద ఏ హత్యాప్రయత్నం జరుగుతుందా అని ఏ రాజకీయ పార్టీని ఎవరు కూలదొయ్యటానికి ప్రయత్నిస్తున్నాడా అని పరిశోధనలు జరపవలసి రావటం దురదృష్టం కాక మరేమిటి? నా కిక్కడ నుంచి పారిపోవాలని వుంది. ఏ కొండల మధ్యకో సెలయేటి తీరాల్లోకో ఇక్కడ వుంటే మాత్రం త్వరలో ఏన్నో స్కిజోఫ్రేనియా రోగిగా మారడం ఖాయం నా మనసు నా ప్రతీ చర్యనీ వ్యతిరేకిస్తోంది. ముఖ్యంగా నా కళ్ళజోడుని బద్దలు కొట్టెయ్యాలి ప్రస్తుతం అదేనా అబ్సెషన్ భగవంతుడా నా తెలివి తేటల్ని కావాలంటే కాసింత వెనక్కి తీసుకో నాకు నచ్చేలా బ్రతికే అవకాశం నాకు వీలైనంత తొందరలో ఇవ్వు. నా గమ్యానికి నన్ను తొందరగా చేర్చు.

I want two hands
between which
I can sleep withput dreams
As life itself would
then be a dream

5

జాగ్రత్తగా వెళ్ళు ఒక వేళ బస్సు తొందరగా వస్తే మాత్రం ఇక్కడే వుండు. కాలేజీ నుంచి వచ్చి నేను అక్కణ్నుండి ఇంటికి తీస్కువెళ్తాను అంది సునాదమాల.

నేను కాదు ఒకవేళ నువ్వే కాలేజీ నుంచి తొందరగా వస్తే భయపడకుండా ఇక్కడే

వేలెడంత లేవు వెధవ నువ్వు నాకు ధైర్యం చెబుతున్నావా? కోప్పడింది సునాదమాల విష్ణు నవ్వేడు. వాడు ఆరో క్లాసు చదువుతున్నాడు. పిల్లల్ని ప్రతిరోజూ స్కూలు మిని బస్సు వచ్చి తీసుకువెళుతుంది. సునాదమాలే వాడికి తల్లి అక్క గురువు ఫ్రెండు వగైరా. మరోరకంగా సునాదకి వాడు బాడీగార్డ్ వీధి మొదలు మేయిన్ రోడ్డులో బస్సు ఎక్కిస్తుంది. ప్రతిరోజూ అక్కణ్నుంచి తను కాలేజీకి వెళుతుంది ఇది దినచర్య.

వీధి పెద్ద రశ్‌గా లేదు. కానీ దారినపోయే ప్రతివారూ, ముఖ్యంగా స్త్రీలు ఆమెని చూస్తున్నారు. అందమైన స్త్రీలని పురుషులకన్నా ఎక్కువగా స్త్రీలే చూస్తారని ఆమెకి అనుభవం చెప్పింది.

నిన్నటి నుంచి ఆమె మంచి మూడ్‌లో లేదు. నిన్న క్లాసులో లెక్చరర్‌తో చీవాట్లు తిన్నది. ఎవరయినా దేముడు ప్రత్యక్షమై తన బుర్రలో కాస్త తెలివితేటలు పెడితే తప్ప లాభం లేదని ఆమె నమ్మకం. ఎంత చదివినా పాస్ మార్కులు రావటం గగనమైపోతూంది నిన్న రాత్రి ఆమెకో కవ వచ్చింది. దేముడు కలలో కనపడి నీకేం కావాలో కోరుకో అన్నాడు. స్వామీ నాకున్న భయాన్ని పోగొట్టు కాస్త తెలివి తేటలు కాస్త మాటకారి తనం ఇవ్వు అంది. అలాగే కానీ దానికి బదులుగా నువ్వు నీ అందాన్ని కాస్త త్యాగం చెయ్యవలసి ఉంటుంది అన్నాడు దేముడు చెప్పు చేస్తావా?

ఆమె సంతోషంగా వప్పుకుంటూ ఉండగా కలలోంచి మెలకువ వచ్చింది. ఆమె ఎంత అమాయకమైందంటే వెంటనే వెళ్ళి అద్దంలో చూసుకుంది.

విష్ణు సునాదమాల బస్‌ల కోసం నిలబడి వుండగా వారికి మూడొందల గజాల దూరంలో పేవమెంట్ రెస్టారెంట్ అద్దాల వెనుక కూర్చుని మాట్లాడుకుంటున్నారు విహారి పద్మాకర్‌లు.

నా కారు నీకు ఒక రోజు పాటు కావాలన్నావ్ బాగానే వుంది కాని నీకు తెలుసా? తన పక్క స్థానాన్ని స్నేహితుడికి ఇవ్వగలిగినవాడే నిజమయిన స్నేహితుడు. అంతేకాని తన సీట్లో కూర్చోబెట్టుకునేవాడు కాడు నిక్కచ్చిగా అన్నాడు విహారి

కారు అడిగినప్పుడల్లా నువ్విదే డైలగు చెపుతున్నావ్. నీ మాటల్లో ఎంత నిజముందో అని సుబ్బలక్ష్మి దగ్గిర కూడ ఆ సుభాషితం చెప్పాను. చెంప బ్రద్దలు కొట్టింది.

విహారి అనుమానంగా ఏ సుభాషితం? అన్నాడు

తనపక్క స్థానాన్ని స్నేహితుడికి ఇవ్వగలిగేదే నిజమయినా స్నేహితురాలు.

ఆందులో చెంప బ్రద్దలు కొట్టవలసిన దారుణం ఏమీ లేదే?

బహుశా స్థకీ దీర్ఘం ఇవ్వటం మర్చిపోయి వుంటాను.

విహారి అర్థం చేసుకునే లోపులో పద్మాకర్ అతడిని మోచేత్తో పొడిచి అరె అటు చూడు అన్నాడు.

సనాదమాల.